# తల్లి రెక్కలు

స్వప్న ఎదురుచూస్తోన్న బస్సొచ్చింది. ఆగింది. ఖాళీగా వుంది కూడా.

అయినా ఆమె ఎక్కలేదు. నిర్వికారంగా చూస్తూండిపోయింది. బస్సెళ్ళిపోయింది.

ఆమె ఇంకా అలాగే చూస్తూ నిలబడింది.

ఆమె మనస్సు డోలాయమానంగా వూగుతోంది.

అటా ? ఇటా ?

నిమిషాలు కరిగిపోతున్నాయి.

ఎటూ తేల్చుకోలేకపోతోంది. కాని సూచిక కొంచెంగా అటే మొగ్గింది.

రక్తం చాలా చిక్కనంటారు. ఒక్కసారి వెళ్ళి అర్థిస్తే తప్పేమిటి ? పైగా చాలా ఏళ్ళ తర్వాత వెళ్తోంది. ఈలోగా ఎన్ని మార్పులైనా వచ్చివుండొచ్చు. అంచేత ఏం జరిగినా జరగొచ్చు. ఇంకేదో జరక్కపోయినా తన పని పూర్తవడం మాత్రం ఖాయం.

ఇంటి పరిస్థితి గుర్తొచ్చింది. దారిద్ర్యం గుర్తొచ్చింది.

అసహ్యమేసింది.

ఇంకా ఎన్నేళ్ళా మురికికూపంలో మగ్గుతుంది ?

బస్టాపులో నిలబడ్డ మిగతా అమ్మాయిలతో పోల్చి చూసుకుంది. ఎంతో న్యూనతగా అన్పించింది.

ఈ స్థితి మారితీరాలి. అంటే కనీసం ఉద్యోగం రావాలి. వస్తుందని ఆశిస్తోన్న వుద్యోగం చేతివ్రేళ్ళ సందుల్లోంచి జారిపోకూడదు. అందుకెలాంటి చిన్న అవకాశమూ ఇవ్వకూడదు.

సో - అక్కడికెళ్ళితీరాలి !

నిర్ణయం ఆమెలో ఉత్సాహాన్ని పొంగించింది.

చక్కని సుందర భవిష్యత్తు కోసం వెళ్ళితీరుతుంది. అర్థిస్తుంది. ఇందులో సిగ్గుపడాల్సిందీ, సంకోచించాల్సిందీ ఏమీ లేదు. ఎంచేతంటే ఆయన సాక్షాత్తూ తనని కన్నతండ్రి !

కొంచెం ముందుకెళ్ళి మరో వైపునున్న బస్టేజీ దగ్గరికెళ్ళింది. ఒక్క నిమిషం కూడా నిరీక్షించాల్సిన అవసరం లేకుండానే బస్సొచ్చింది. అదృష్టం కలిసిరావడమంటే ఇదే అనుకుంటూ ఎక్కేసింది.

ఆమె పక్కనో అమ్మాయి కూర్చుంది. స్వప్నలాగే జస్ట్ టీనేజ్ దాటిన అమ్మాయి.

కోల మొహం, నిండైన కళ్ళు. పొందికైన అవయవ సంపద, మెరుస్తోన్న సల్వార్ కమీజు, మెడలో గొలుసు, ఓ చేతికి బంగారు గాజులు. చాలా అందంగా ఉంది. ఆరోగ్యంగా ఉంది. ఆనందంగా ఉంది. చక్కని భవిష్యత్తుకి ఇన్స్యూర్ చేయబడినట్టుంది.

ఈర్ష్యపడకుండా వుండలేకపోయింది స్వప్న.

తనామెకి పూర్తి భిన్నంగా వుంటుంది. సన్నగా, పొడవుగా, చామనఛాయగా, లోతుకుపోయిన కళ్ళతో, వుండీలేనట్లుండే వక్షంతో, ఇస్త్రీలేని కాటన్ చీరతో - ఒక్క మాటలో చెప్పాలంటే నలిగిన కాగితం పువ్వులా వుంటుంది. ఆగమ్యగమ్యం వైపు నిరాశగా అడుగులేస్తున్నట్టు వుంటుంది !

ఏదో తెలీని ఉక్రోషం ముంచెత్తగా రోషంగా చూసింది. నిరసనగా చూసింది. కసిగానూ చూసింది.

'చూస్తూండు. నాకూ ఓ రోజు వస్తుంది. అవాళ చెబుతా నేనేమిటో, నా తడాఖా ఏమిటో, అప్పుడు నాకూ రెక్కలొస్తాయి. సుందర లోకంలోకి ఎగిరిపోతాను. మా డాడీ ఎవరో తెలుసా? మీ నాన్నలా గుమస్తాయో, చిరు వ్యాపారో కాదు. పరిశ్రమల శాఖలో ఉన్నతాధికారి. బీ కేర్ ఫుల్ !'

దిగాల్సిన స్టేజి వచ్చింది.

ఆ అపరిచిత అమ్మాయి వంక అదోలా చూసి తలెగరేసింది. హుందాగా దిగి పోయింది.

ఆఫీసు ప్రాంగణంలో అడుగుపెట్టింది స్వప్న. ఒక్కసారిగా హీనభావమేదో ఆవహించింది. కుంచించుకుపోయింది. తడబడుతూ బెదురుచూపులు చూస్తూ లోనికెళ్ళింది.

తండ్రి ఉండే రూము ముందాగింది. అదుర్తోన్న గుండెల్తో చూసింది. అధైర్యంగా చూసింది.

స్టూలు మీద కూర్చున్న ప్యూను లేవలేదు. ఆమెని పట్టించుకోనూ లేదు. తనెవరో అతడికి తెలీదు కదా అని సరిపెట్టుకుంది.

"లోపలికెళ్ళాలి" మెల్లగా అంది. తన మాటలు తనకే సరిగ్గా విన్పించలేదు.

"అయ్యగార్ని కలవాలా?"

తలూపింది.

"ఎందుకూ?"

చెప్పలేకపోయింది. ఆయన కూతుర్ననీ చెప్పలేకపోయింది.

"ఈ చీటీ మీద పేరూ అదీ రాసివ్వు"

'హమ్మయ్య' అనుకుంది.

'స్వప్న' అని రాసిచ్చింది.

చీటీని, ఆమెనీ మార్చి మార్చి చూసి లోపలికెళ్ళి వచ్చేడు.

ఆత్రుతగా చూసిందతడి మొఖంలోకి.

ఎక్కడ తనని చూడ నిరాకరిస్తారోనన్న భయం నిలువునా నమిలేస్తోందామెని.

అతడామె వంక చూడనేలేదు. ఏమీ పట్టనట్లుండిపోయాడు.

మూడు నిమిషాలు మూడు యుగాల్లా గడిచాయి.

బెల్ మ్రోగింది. లోపలికెళ్ళొచ్చి "రమ్మంటున్నారు, వెళ్ళు" అన్నాడు ప్యూను.

లోపలికెళ్ళింది. అప్రయత్నంగా చేతులు జోడించింది.

ఆయన తనని గుర్తించారో లేదోనన్న సందిగ్ధం వెంటాడగా ఆయన మొఖంలోకి చూసింది. ఎలాటి సమాధానమూ లభించలేదు. తనలో తల్లి పోలిక లెక్కువగనుక గుర్తించి వుండొచ్చని సమాధానపడింది.

కూర్చోమని కుర్చీ చూపించారు. కూర్చుంది.

"ఏవిటి....."

"చిన్న పనుండి వచ్చానండి....."

"ఏంటదీ...."

"మధ్యాహ్నం ఇంటర్వ్యూకెళ్ళాను. బాగా చేశాను. మీ నాన్నగారెవరన్నారు. చెప్పేను. మీరు బాగా తెలుసంట – ముందే చెబితే ప్రశ్నలడక్కుండానే పంపించేద్దుం కదా అన్నారు. ఉద్యోగం నాకిచ్చినట్టేనని కూడా అన్నారు. మళ్ళీ ఎవరైనా రికమండేషన్‌తో వచ్చి

తన్నుకుపోతారేమోనని.....మీరో మాట చెబితే ఆ ఉద్యోగం నాకే వస్తుంది. చాలా కష్టాల్లో వున్నాం...."

ఆమె కంఠం సన్నగా కంపించింది. కన్నీటి పొర కదిలింది.

"ఏం ఉద్యోగం?"

"టెలిఫోన్ ఆపరేటర్"

"ఆఫీసరెవరు?"

చెప్పింది.

"చెబుతాన్లే"

ఆమెకి కొండంత బలమూ, ఉత్సాహమూ వచ్చేశాయి.

"థాంక్యూ థాంక్యూ సార్....." మళ్ళీ చేతులు జోడించి వచ్చేసింది.

ఏదో సాధించినట్టూ, మరేదో జయించినట్టూ వున్న ఆమెని చూసి మ్రాన్పడిపోయాడు ప్యూను.

అతడ్ని పట్టించుకోలేదామె. ఠీవిగా బయటికి నడిచింది.

"ఇంతాలస్యమయ్యిందేమే"

తల్లి మీద కస్సున పడింది స్వప్న. "నా ఇష్టం. ఎక్కడెక్కడికో వెళ్తాను. ఎవరెవర్నో కలుస్తాను. అన్నీ నీకు చెప్పాలా?" పెంకెగా జవాబిచ్చింది.

హఠాత్తుగా కూతుర్లో వచ్చిన వింత మార్పుకి, మారిన ధోరణికి విస్తుబోయింది రాజ్యం. విస్మయంగా చూస్తూ "ఇంటర్వ్యూ బాగా చేశావా" అనడిగింది.

"బాగా చెయ్యకపోయినా నాకిస్తారు. నేనెవరో తెలుసా? గ్రేట్ ఆఫీసర్ వెంట్రావుగారమ్మాయిని. ఏంటలా చూస్తున్నావ్? నా బ్రతుకుని నాశనం చేసింది నువ్వు కాదూ ! ఆఫీసరుగారమ్మాయిలా కార్లలో తిరగాల్సినదాన్ని బతకలేని బడిపంతులమ్మ కూతురిగా దిగజార్చేశావ్. అన్నీ వుండి కూడా ఏమీలేనిదాన్ని చేశావ్. దీనికంతటికీ కారణం నువ్వే! నువ్వే!!....."

రోషంగా అనేసి వెళ్ళి మంచం మీద బోర్లపడి ఏడ్చేసింది స్వప్న.

ఆమెలో వచ్చిన మార్పుకి కారణం అర్థమైంది. కూతురి ప్రక్కనే కూర్చుని తల నిమురుతూండిపోయింది.

తల్లి మొహంలో వీచిన బాధావీచికలుగాని, కదలిన కన్నీరుగాని స్వప్న చూళ్ళేదు. చూసివుంటే తన మాటలు వాడి ఈటెలై సూటిగా ఆమె గుండెల్లో దిగాయని గ్రహించి వుండేది.

"అప్పుడూ, ఇప్పుడూ కూడా నీ బాగే కోరుతున్నాను. నీ కోసం నీ భవిష్యత్తుకోసం పరితపిస్తున్నాను. నేనేమైపోయినా ఫర్లేదు. నువ్వు సుఖంగా వుంటే అంతే చాలు"

కళ్ళు తుడుచుకుంటూ అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

గుండెల్లో కెలికినట్టు అనుభూతి చెందింది స్వప్న. అనవసరంగా తల్లిని నొప్పించానేమోనని బాధపడింది. కానదెంతోసేపు నిలవలేదు.

రంగుల వూహల్తో కమ్మని లోకాన్ని నిర్మించుకుంటూండిపోయింది.

కూతుర్ని వెదుక్కుంటూ వచ్చాడు వెంకట్రావు. తల్లీ కూతుళ్ళ ఆశ్చర్యానికి అవధుల్లేకపోయాయి. ఆనందోద్వేగంతో స్వప్న ఉక్కిబిక్కిరయ్యింది. దు:ఖం కట్టలు త్రెంచుకోగా ఏడ్చేసింది అంతలోనే మంటలు కక్కింది.

"స్వప్న నా కూతురు. ఇన్నాళ్ళూ తినీ తినకా దాన్ని పెంచి పెద్ద చేశాను. అది నాలుగు రాళ్ళు సంపాదించి నన్ను సుఖపెడుతుందని ఆశిస్తోంటే దాన్ని నా నుండి వేరు చేద్దామని వచ్చారా? వీల్లేదు. స్వప్నని మీ కప్పగించేది లేదు గాక లేదు"

"ఇలాంటి మూర్ఖపు పట్టుదలతో దాన్ని నా నుండి వేరు చేశావు. ఆఖరికి తిండిక్కూడా మొఖం వాచేలా చేశావు. బుల్లి ఉద్యోగానికి పంపేవు. ఇంక నేను చూస్తూ వూరుకోలేను. ఊరుకుంటే ఏ గతి లేనివాడికో ఇచ్చి కట్టబెడతావు"

స్వప్న గురించి తల్లీ తండ్రీ పోటీపడ్డారు. దెప్పుకున్నారు. తిట్టుకున్నారు.

కడకి తండ్రే గెలిచాడు.

స్వప్న ఆనందనాట్యం చేసింది.

తండ్రితోబాటు కారెక్కి వెళ్ళిపోయిది. ఆమె సీతాకోకచిలుకలా మారిపోయింది. అందాల ఆఫీసర్తో పెళ్లయ్యింది....

స్వప్న రంగుల స్వప్నలోకం లోంచి బయటపడింది.

కళ్ళెదుట కారు చీకటి. ఘోర వాస్తవం !

గాఢంగా నిట్టూర్చింది.

అది కలగా మిగిలిపోకుండా వుంటే ఎంత బావుణ్ణనుకుంది. మిగిలిపోదని గట్టిగా సర్ది చెప్పుకుంది.

ఆ రాత్రి మరి నిద్ర పట్టలేదామెకి.

మర్నాడు కూడా స్వప్న ప్రవర్తన వింతగానే ఉంది.

మాటల సందర్భంలో కూతురు తండ్రిని కలిసిందని తెలిసింది రాజ్యానికి. మంచు విడినట్టయ్యింది. సంగతి అర్థమవ్వగానే భారంగా నిశ్వసించిందామె.

మాజీ భర్త వెంకట్రావు గురించి ఆమె కన్నా ఎవరికీ ఎక్కువ తెలీదు. అతడిలోని కాంక్షలూ వురుకులూ పరుగులూ బలహీనతలూ బలమైన అంశాలూ అన్నీ ఆమెకి కరతలామలకం.

తొలి రాత్రే అతడి తత్వం బోధపడిందామెకి.

అతడు మూర్తీభవించిన స్వార్థపరుడు. తనూ తన సుఖం తన పరువు తన బాగు తప్ప మరేమీ పట్టదు. మరేది ఏమైనా పట్టించుకోడు. అంతేకాదు వాటికోసం ఏం చెయ్యడానికైనా సిద్ధపడతాడు.

అతడి ఊహలు మాధురి రూపంలో ప్రాణం పోసుకుని ఎదురయ్యాయి.

పెళ్ళైన ఆర్నెల్లకి ఆమెతో పరిచయమయ్యింది వెంకట్రావుకి. ఆమె ఓ కాంట్రాక్టర్ కూతురు. ఆ కాంట్రాక్టర్‌తో వున్న లాలూచీ వ్యవహారాల వల్ల ఆమెకి దగ్గరయ్యాడు. ఆమె ఆకర్షణలో మునిగి తేలాడు. అందలం అధిరోహించడానికామె సరియైన మెట్టు అనుకున్నాడు.

మరేమీ ఆలోచించలేదు. టకటకా ఎక్కేశాడు.

భార్యని వదిలేశారు. పొత్తిళ్ళలోని బిడ్డ మొహం చూడనన్నాడు. వాళ్ళతో తనకెలాటి సంబంధమూ లేదని తెగేసి చెప్పేశాడు. ఎవరెలా పోయినా ఏమైపోయినా తనకి సంబంధం లేదన్నాడు.

అనడమే కాదు, అక్షరాలా అంతే చేశాడు.

అంతేకాదు. చకచకా నిచ్చెన మెట్టెక్కేశాడు. మావగారి సాయంతో ప్రమోషన్లు కొనుక్కున్నాడు. ఆస్తుల్నీ కొన్నాడు. అంతస్తునీ కొన్నాడు.

రాజ్యానికి పుట్టింటి వారి ఆసరా ఎండమావి అయ్యింది. చదివిన చదువుకి సరైన ఉద్యోగమూ లభించలేదు. గత్యంతరం లేక కాన్వెంట్లో టీచరుగా చేరింది.

బిడ్డని ఏ అనాథ శరణాలయంలోనే చేర్చి నీ బతుకు నువ్వు చూసుకోమని సలహా ఇచ్చారు కొందరు. నెలల పాప కోసం నూరేళ్ళ బతుకు మోడు చేసుకోవద్దన్నారు.

కానీ ఆమె వినలేదు.

తన సుఖం కన్నా పేగు తెంచుకు పుట్టిన బిడ్డ సౌఖ్యం ముఖ్యమనుకుంది. తనవి బలహీనమైన రెక్కలని తెలుసు. అయినా వాటితోనే సాధ్యమైనంత ఎక్కువ రక్షణ కల్పించడానికి సిద్ధపడింది.

కాన్వెంటు నిర్వాహకులిచ్చే కొద్దిపాటి జీతంతో జీవితరథాన్ని ఈడ్చుకొచ్చింది.

టెన్త్‌క్లాసు పాసైన స్వప్న కాలేజీలో చేరతానని పట్టుబట్టింది. తమ ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించదని చెప్పినా విన్పించుకోలేదు.

గత్యంతరం లేక తండ్రి దగ్గరకి తీసుకెళ్ళింది. సిగ్గు విడిచి కూతురికి చేయూత నిమ్మని అర్థించింది రాజ్యం.

నాకేం సంబంధం లేదనేశాడు.

ఆశలు కుప్పకూలాయి. అయినా ఓటమి నంగీకరించలేదు రాజ్యం.

ట్యూషన్లకి ఒప్పుకుంది. కూతుర్ని కాలేజీలో చేర్చింది.

మళ్ళీ ఇన్నేళ్ళకి ఇప్పుడు స్వప్న తండ్రిని వెదుక్కుంటూ వెళ్ళిందన్నమాట. నేతి బీరకాయలో నెయ్యి వుంటుందని భ్రమించేంత పిచ్చిది !

అతడు యోగక్షేమాలు కనుక్కుని కాస్తంత ఆదరంగా మాట్లాడి వుంటాడు. ఆ మాత్రానికే నింగి చేతికందినట్టు పొంగిపోతోంది. పిచ్చిది!

ఒకవేళతడు నిజంగా మారి వుంటే కూతుర్ని ఆదరించాలనుకుంటే– ఆమె బాధ్యత స్వీకరించడానికి ముందుకొస్తే– స్వప్న అదృష్టవంతురాలవుతుంది.

కానలా జరుగుతుందా ?

కాదంటోంది తన అనుభవం.

అవునంటోంది కన్న మమకారం.

ఏమవుతుందో చూడమంటోంది వివేకం.

ప్రేక్షకురాల్లా చూడడానికే నిశ్చయించుకుంది రాజ్యం.

వారం రోజులు గడచిపోయాయి.

అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ రాలేదు. మరో నాలుగు రోజులు గడచిపోయాయి. వూహు– రాలేదు!

స్వప్న మరి నిలవలేకపోయింది. ఆఫీసుని వెదుక్కుంటూ వెళ్ళింది.

టెలిఫోన్ ఆపరేటర్‌గా కొత్తమ్మాయి కనిపించింది.

తనతోబాటు ఇంటర్వ్యూ కొచ్చిన ఆమెని గుర్తుపట్టింది.

నవనాడులూ కృంగిపోయాయి.

దు:ఖం, ఉక్రోషం, ఉద్రేకం, కోపం అన్నీ ఒకదాన్తో ఒకటి పోటీపడుతుంటే విసవిసా ఆఫీసరు దగ్గరికెళ్ళింది.

"సార్.......నా ఉద్యోగం....."

"అయాం సారీ"

"నాకే ఇస్తానన్నారు...."

"ఇవ్వటానికి నోట్ తయారయ్యింది కూడా. కానీ....."

"కానీ? ఏం జరిగింది సార్. నా పొట్ట కొట్టిన పాపాత్ముడెవరు సార్? ఏ రికమెండేషన్‌కి వంగేరు, ఏ లంచానికి లొంగారు సార్?" ఉద్రేకపడింది.

"షటప్. మీ నాన్నే ఇవ్వొద్దన్నాడు. నువ్వాయన కూతురివే కాదు పొమ్మన్నాడు. అలా చెప్పుకు తిరుగుతున్న పిచ్చిదానివన్నాడు. పిచ్చోళ్ళకి ఉద్యోగాలిచ్చేంత ఔదార్యం నాకు లేదు గాని వెళ్ళెళ్ళు....."

ఇంటికెలా వచ్చి పడిందో స్వప్నకే తెలీదు.

తల్లిని కావలించుకుని బావురుమంది.

ఆకాశానికి చిల్లులు పడినట్టుగా దు:ఖపు వర్షం ముంచెత్తింది.

చేతుల్ని బిడ్డ చుట్టూ వేసి పొదవి పట్టుకుంది రాజ్యం.

ఆమె చేతులు బలహీనమైనవే. కాని బలంగా పట్టుకున్నాయి. పదిలంగా పట్టుకున్నాయి. ఎవరున్నా లేకున్నా నేనున్నానీకని భరోసా ఇస్తూ పట్టుకున్నాయి.

తల్లి రెక్కల మాటున ఒదిగిపోయింది బిడ్డ.

**(ఆంధ్రజ్యోతి వారపత్రిక 4.2.94)**